క్లుప్తంగా

చర్మకారులను ఆదుకున్న ఘనత సీఎం జగన్‌దే



థ్యాంక్యూ సీఎం సార్ అంటున్న డప్పు, చర్మ కళాకారులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు పింఛన్ అందించి ఆదుకుంటున్నారని, థ్యాంక్యూ సీఎం సార్ అంటూ డప్పు, చర్మకారులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా డప్పు, చర్మకారులు, చేనేత కార్మికులకు నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కళాకారులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి యుగాంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో ఆదివారం ఉదయం 7.30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సర్పంచ్ జయరామ్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటేశులు శనివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని వారు కోరారు.

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లిలో ఆదివారం మంత్రి ఉషశ్రీచరణ్ గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివన్న శనివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె. విజయ్‌కుమార్, అర్చకుల ఆధ్వర్యంలో శనివారం పల్లకీ సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి, మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. అంతకుముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన టి.రాజశేఖర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సలహా మండలి(ఏపీ అగ్రి అడ్వైజరీ బోర్డు) సభ్యుడిగా నియమితులు కావడంతో.. ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం మండలంలోని గడేహోతురు గ్రామానికి చెందిన సర్పంచు కె.సురేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మారెడ్డి, పరమేష్, అట్టెల హరీష్ తదిత రులు కమలపాడు గ్రామానికి చేరుకుని ఆయనను సత్కరించారు. అలాగే వెంకటాంపల్లిపెద్దతండా సర్పంచు కొర్రా శివాజీనాయక్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి సామానాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ గోపాల్, ధర్మానాయక్, ఉప సర్పంచు వెంకటేష్‌నాయక్ తదితరులు రాజశేఖర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.3 కోట్లతో ఇంటింటికీ కొళాయి

ఉరవకొండ: పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వతకు పరిష్కారం కల్పిస్తూ జల జీవన్ మిషన్(జేజేఎం) ద్వారా దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇస్తున్నామని సర్పంచ్ లలితమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదా బేగం, వైఎస్సాఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు అన్నారు. శనివారం స్థానిక కామన్న కట్ట సమీపంలోని నాగులకట్ట వద్ద నూతన బోరును వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. సర్పంచ్ మట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితంగా ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు ప్రారంభించామన్నారు. దీంతో పాటు ఇంటింటికీ కొళాయి పథకం ప్రారంభించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉరవకొండ పట్టణ సుందరీకరణకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఓబుళమ్మ, బాను, నాయకులు ఎర్రిస్వామి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

'రక్తహీనత' పిల్లలపై శ్రద్ధ చూపండి

కూడేరు: రక్తహీనత ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీడీపీఓ ధనలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం కూడేరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్ట్ స్థాయిలో సమావేశం నిర్వహించారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, కూడేరు మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రక్తహీనత ఉన్న పిల్లల గృహ సందర్శనను తప్పకుండా చేయాలని సూచించారు. కేంద్రాలనికి వచ్చే పిల్లల, గర్భిణులు, బాలింతల హాజరును వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

'కాలవా'.. నాటకాలు మానవా?

- నాటి ఆనవాళ్లే.. నేటికీ వెక్కిరింతలు
- టీడీపీ హయాంలోనే ఉద్దేహాళ్ చింతవనంలో ఇసుక దోపిడీ
- అవినీతిపై చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్



ఇసుక తరలించడంతో ఉద్దేహాళ్ చింతవనంలో వేర్లు తేలిన చెట్లు (ఫైల్)



తిమ్మలాపురం వద్ద ఇసుక తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

రాయదుర్గం: టీడీపీ హయాంలో కొల్లగొట్టిన ఇసుక గోతులు నేటికీ వెక్కిరిస్తున్నాయి. వాగు, వంక మొదలు వేదావతి నది నుంచి అడ్డగోలుగా రాత్రి, పగలు తేడా లేకుండా సరిహద్దులు దాటించి రూ.కోట్లు కూడగట్టిన వ్యవహారంపై ప్రజల్లో విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. దొంగ.. దొంగ అంటూ వంద సార్లు పలికైనా బలమైన నిందను ఎదుటి వారిపై నెట్టేందుకు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఇన్నాళ్లూ చేసిన కుట్రలు ఫలించక పోవడంతో కొత్త నాటకానికి నాంది పలికారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ చింత వనం నుంచి డి హీరేహాళ్ మండలం తిమ్మలాపురం వేదావతి హగరి వరకూ సోమవారం టీడీపీ శ్రేణులతో కలసి పాదయాత్రకు శ్రీకారం చుట్టడంపై శ్రీనివాసా..? ఏమిటీ ఘోష అంటూ సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. గత టీడీపీ హయాంలో ఇసుకలో చేపట్టిన భారీ అవినీతిపై తన సొంత మానస పుత్రికగా చెప్పుకునే 'ఈనాడు' లోనే 'మంత్రి ఇలాకాలో కంత్రీలా కులాసా' అంటూ పెద్ద అక్షరాలతో అచ్చేయడం.. రోజుకు రూ.10 లక్షల వరకూ ఇసుక లో దోపిడీకి పాల్పడడం, నెలకు రూ.3 కోట్లు అక్రమంగా కూడగట్టడం లాంటి కీలక వ్యవహారాలు పార్టీ నాయకులు, ప్రజల్లోనూ అప్పట్లో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు డ్వాక్రా మహిళల ముసుగులోనూ భారీ ఎత్తున దోపిడీకి పాల్పడ్డారనే అభియోగాలు కూడా సంచలనంగా మారాయి.

ఇసుక తవ్వకాల్లో రూ.కోట్లు వెనకేసుకున్నారు..

కణేకల్లు మండలం రచ్చుమర్రి సమీపంలో వేదావతి నదిలో ఓ టీడీపీ ముఖ్యనాయకుడు, ప్రముఖ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఇసుక తవ్వకాల్లోనూ రూ.కోట్లు కూడగట్టారనే అభియోగాలు వినిపించాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ఏడు టిప్పర్లను కణేకల్లు పోలీసులు అదుపులోకి తీసుకోవడం, వాటిపై కేసులు లేకుండా కాలవ ఒత్తిడి తీసుకురావడం.. పత్రికల్లో కథనాలు వండీ వార్చడం.. దీనిపై టీడీపీ అధిష్టానం కూడా సీరియస్ కావడం లాంటి పరిణామాలు చర్చకు దారితీశాయి. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ చింతవనం, వేదావతి హగరిలోనూ ఇబ్బడిముబ్బడిగా ఇసుక తవ్వకాలు చేపట్టిన తమ్ముళ్లు ఓ ఫ్యాక్టరీలో డంప్‌చేసి రాత్రివేళ గుట్టుగా సరిహద్దు దాటించారనే ఆ ప్రాంత ప్రజలు నేటికీ చెప్పుకుంటున్నారు. డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం, తిమ్మలాపురం ప్రాంతాల్లోనూ ఆ నాటి గోతులు నేటికీ దర్శనమిస్తున్నాయని ఆ గ్రామల ప్రజలు వాపోతున్నారు. గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లోనూ భారీగా డంపులు బయటపడి కేసులు కూడా నమోదు కాబడ్డాయి. ఇలాంటి పరిణామాల మధ్య ప్రజలు ఇప్పుడిప్పుడే మరిచిపోతున్న ఇసుక వ్యవహారాన్ని పాదయాత్ర ద్వారా మనమే గుర్తుచేసిన వారవుతామని పార్టీలోని సీనియర్లు కొందరు వ్యతిరేకిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఇసుకపై పాదయాత్ర చేపట్టడం అర్థరహితమని, ఎవరి హయాంలో ఎంత దోపిడీ జరిగిందో నిలదీసేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు.

కాలవ హయాంలోనే ఇసుక దోపిడీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం(డీహీరేహాళ్): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు హయాంలోనే ఇసుక దోపిడీ భారీగా జరిగిందని మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్ నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం. వన్నూర్‌స్వామి ఆరోపించారు. డి.హీరేహాళ్ మండల కేంద్రంలో శనివారం పార్టీ నాయకులతో కలసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇసుకలో రూ.కోట్లు కొల్లగొట్టింది ఎవరో ప్రజలకు తెలిదా అని ప్రశ్నించారు. నీ హయాంలో జరిగిన అవినీతిపై నిగ్గుతేల్చాకే పాదయాత్ర చేపట్టాలని, లేకపోతే ప్రజలతో కలసి అడ్డుకుంటామని హెచ్చరించారు. నీ మానస పుత్రికగా చెప్పుకునే ఈనాడు లోనే నీ అవినీతిపై కథనాలు ప్రచురించింది నిజం కాదా? అని నిలదీశారు. నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల నుంచి దోచిన ఇసుకను బెంగళూరుకు తరలించి రూ.కోట్లు కూడగట్టలేదా అని మండిపడ్డారు. నీవా ఇసుకపై పాదయాత్ర చేసేదని ధ్వజమెత్తారు. ఇసుక దోపిడీపై చర్చకు రావాలని వారు సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మైనార్టీ నాయకుడు రహంతుల్లా, కదలూరు, జాజరకల్లు సర్పంచులు హనుమంత రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు రాళ్ల తిమ్మారెడ్డి, సింగాడి జగదీష్, డాబా మంజు, సింగాడి మంజునాథ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసుకోవాలి

రాయదుర్గంటౌన్: జగనన్న హౌసింగ్ లే అవుట్లలో సకాలంలో ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ చంద్రశేఖర్ సూచించారు. శనివారం పట్టణంలోని మల్లాపురం హౌసింగ్ లేఅవుట్‌ను ఏఈ జయచంద్రతో కలసి వారు పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశమై అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని, ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వారు సూచించారు. ఇప్పటి వరకూ ప్రారంభించని వారు వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని 8వ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సమయ పాలన పాటించాలని, సిబ్బందికి సూచించారు.

జగనన్న లే అవుట్ పరిశీలన

కళ్యాణదుర్గం: హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా స్థానిక కురాకులతోట జగనన్న లే అవుట్‌లో శనివారం హౌసింగ్ డీఈ శైలజ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, ఏఈ రామ్మోహన్, వార్డు అనిమిటీస్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిల్లో ఉన్న నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇప్పటివరకు పునాదులు కూడా తవ్వని లబ్ధిదారుల వివరాలను సేకరించి, త్వరతగతిన నిర్మాణ పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వార్డు అనిమిటీస్ అంజనేయులు, ఫర్వీన్, పవన్, ఎస్.పవన్, అనిత, సాయికుమార్, ఉపేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

రాయదుర్గంటౌన్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉత్తమ పౌరులుగా ఎదగాలని జూనియర్ సివిల్ జడ్జి లావణ్య సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం విద్యార్థులకు కోర్టు విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వు



కళ్యాణదుర్గం: కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



శెట్టూరు: యర్రబేరేపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి

- పింఛన్లపై బహిరంగ చర్చకు సవాల్
- ఉన్నం, ఉమా.. ఏ మొహంతో గ్రామాలకు వెళ్తున్నారు..?
- పింఛన్ వారోత్సవాల్లో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ.2,750 అందిస్తూ అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వు నింపుతున్నామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శనివారం పింఛన్ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హత ఉన్న ప్రతి అవ్వ,తాతలకు నేరుగా సచివాలయం ద్వారా పింఛన్ అందజేస్తున్నామన్నారు. 2014–19 మధ్యలో టీడీపీ ఐదేళ్ల కాలంలో కళ్యాణదుర్గం రూరల్ పరిధిలో 5,326 మందకి రూ.60.60 లక్షలు ఖర్చు చేసిందన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో 3726 మందికి రూ.కోటి మాత్రమే ఖర్చు పెట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రెండింతలు పెంచుతూ పింఛన్లు అందిచామన్నారు. కళ్యాణదుర్గం రూరల్‌లో 6,310 మందికి రూ.1.75 కోట్లు, మున్సిపాలిటీలో 4,186 మందికి రూ.1.23 కోట్లు అందజేస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సిఫారసులకే పెద్దపీట వేస్తూ పింఛన్లు ఇచ్చారన్నారు. పింఛన్ల పంపిణీపై బహిరంగ చర్చకు రాగలరా...అంటూ టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, టీడీపీ ఇన్‌ఛార్జ్ ఉమా మహేశ్వర నాయుడుకు ఏం పనిలేదన్నారు. ఎంచుకున్న గ్రామాల్లో టీడీపీ వారితో తనను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిట్టించడానికే ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని ఎంచుకున్నారని ఎద్దేవా చేశారు. ఏ మొహం పెట్టుకుని గ్రామాలకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో ఎన్నికలకు రావాలని, మిమ్మల్ని ఓడించే సత్తా నాకుందని ఘాటుగా స్పందించారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు కందుకూరు, గుంటూరులలో అమాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ కాంతమ్మ నాయకులు సుధీర్, హనుమంతరాయుడు, మండల మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు, కౌన్సిలర్లు అర్చన, లక్ష్మన్న, అబ్రహాం, కుర్రా రాము, హేమావతి, అఫ్జల్, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ 'నవరత్నాలు'

శెట్టూరు: ప్రతి గడపకూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు అందించామని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని యర్రబేరేపల్లిలో శనివారం ఉదయం, కంబాలపల్లిలో సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ బుక్‌లెట్ అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. సీఎంకు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక చంద్రబాబు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివన్న, జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథరెడ్డి, వైస్ ఎంపీపీ వి.లక్ష్మీదేవి, సర్పంచ్‌లు పెరుగు తిమ్మరాజు, చట్టమ్మ, ప్రకాష్, గొర్ల గంగాధర, పాలయ్య, విరుపాక్షిగౌడ్, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డెరెక్టర్ పాలాక్షి, మాజీ ఎంపీపీ రాంభీమప్ప, నాయకులు ముత్యాలు, వన్నూరు స్వామి, ఇమామ్ వలీ, శ్రీనివాస్ రెడ్డి, రామలింగారెడ్డి, వెంకటరమణ, శివశంకర్, హరినాథ రెడ్డి, బొమ్మజ్జి రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో మండలంలోని పీసీ ప్యాపిలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కిష్టప్ప, వీరాంజనేయులు, అర్జున్, భీమప్ప తదితరులు విశ్వేశ్వరరెడ్డిని కలిశారు. వారు పలు సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా.. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాలు అమలు సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి సన్మానం



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

ఉరవకొండ: నియోజకవర్గంలోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో దాదాపు 42 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేయించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ దృష్టికి తీసుకెళ్లి 64 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని కోరగా ఇందులో 42 కేంద్రాలకు ప్రభుత్వం సొంత భవనాలు మంజూరు చేసింది. మిగిలిన 22 భవనాలకు కూడా త్వరలోనే సొంత భవనాలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మావతి, ఉద్యోగులు జయలక్ష్మి, మహేశ్వరీ, మునెమ్మ, సువర్ణమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు అభిషేకం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామికి శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన నేమకల్లు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కొల్లాపురమ్మ దేవస్థానానికి రూ. 25 వేలు ఆర్థిక సాయం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ముఖ్యమంత్రి పెద్దపీట



తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ఉన్నత విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాబార్డు నిధులు రూ.1.17 కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి భవనాలను మంత్రి ప్రారంభించారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తరగతి గదులను ప్రారంభించి పూజలు చేశారు. ఉన్నత విద్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించాలన్న సంకల్పంతో జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ప్రయోజకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి, పార్టీ అధికార ప్రతినిధి నారాయణపురం వెంకటేశులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, ఎంపీపీ మారుతమ్మ, కౌన్సిలర్ అర్చన, కో ఆప్షన్ సభ్యుడు అఫ్జల్, నాయకులు సుధీర్, గోళ్ల మోహన్‌రెడ్డి, పెరుగు తిమ్మరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పారదర్శకంగా పింఛన్ల మంజూరు

కంబదూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా కొత్త పింఛన్లను మంజూరు చేసిందని సర్పంచ్ రాజగోపాల్ అన్నారు. శనివారం మండలంలోని నూతిమడుగు పంచాయతీ కార్యాలయంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నగదు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ముకుంద, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలసీదారుల సంక్షేమమే ధ్యేయం

రాయదుర్గం: పాలసీదారుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ఎల్ఐసీ కృషి చేస్తోందని రాయదుర్గం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున తెలిపారు. శనివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆయన అసిస్టెంట్ బీఎం విశ్వనాథ్, అభివృద్ధి అధికారులు అరవింద్‌బాబు, నరేష్‌తో కలసి జీవన్ శాంతి పెన్షన్ నూతన విధానాలపై కస్టమర్లకు వివరించారు. అనంతరం ఏజెంట్ మద్దిలేటి ప్రభాకర్, సిబ్బంది సత్యనారాయణ, రవీంద్ర, రామకృష్ణారెడ్డి, తిప్పేస్వామి, బాషాతో కలసి కరపత్రాలనువిడుదల చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ డీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపురం గ్రామానికి సత్యసాయి తాగునీరు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పాలవాయి పంచాయతీ పరిధిలోని మల్లాపురం గ్రామానికి సత్యసాయి తాగునీరు అందించనున్నారు. ఆర్డీటీ టెక్నికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఏటీఎల్ రామకృష్ణ, ఎస్టీఎల్ వెంకటేశులు, ఎంపీటీసీ లింగమ్మ, ఈడీసీ మెంబర్లు గోవిందరాజులు, భీమన్న, రామకృష్ణ, మల్లికార్జున, రవీంద్ర, ఉమేష్‌గౌడ్, నాయకుడు గోపాల్ శనివారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో గ్రామస్తులు ఆర్డీటీని ఆశ్రయించడంతో.. సంస్థ యాజమాన్యం స్పందించి రూ.20 లక్షలు మంజూరు చేసింది. పైప్‌లైన్ ఏర్పాటుకు ఆర్డీటీ ఆర్థికసాయం చేయగా మిగిలిన పనుల ఖర్చులను గ్రామపంచాయితీ భరించేలా ఒప్పందం కుదుర్చుకుని తాగునీటి పనులు చేపట్టేందుకు తీర్మానం చేశారు.

చేపల పెంపకానికి చెరువు వేలం

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి చెరువులో చేపలు పెంచి విక్రయించడం కోసం సర్పంచ్ ఊలెమ్మ అధ్యక్షతన శనివారం వేలం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి హేమంతరాజు తెలిపారు. తొమ్మిది మంది వేలంలో పాల్గొనగా.. రామన్న అనే వ్యక్తి రూ.23,500కు వేలం పాడి చెరువును దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాగు పట్టాలివ్వాలి

కూడేరు: మండల కేంద్రంలోని సర్వేనంబర్ 535లో ఉన్న భూమిని సాగు చేసుకున్న పేదలందరికీ పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో వినతి పత్రాన్ని తహసీల్దార్ మధుసూదన్‌కు అందజేశారు. సీపీఎం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కణేకల్లు–మాల్యం మార్గమధ్యంలో బ్రిడ్జి నిర్మించండి

కణేకల్లు: కణేకల్లు–మాల్యం మార్గమధ్యంలో వేదవతి హగిరిపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ డి.పద్మావతి కలెక్టర్ నాగలక్ష్మికి విన్నవించారు. శనివారం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన కలెక్టర్‌ను కలసి సమస్యను విన్నవించారు. కణేకల్లు–మాల్యం మార్గమధ్యంలో భారీ వర్షాలకు రోడ్డు పాడై రాకపోకలు పూర్తిగా నిలిచిపోగా... మరో వైపు హెచ్చెల్సీ అక్విడెక్ట్‌పై వాహనాల రాకపోకలను హెచ్చెల్సీ అధికారులు నిలిపేశారన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు.